రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్

కాచిగూడ: ప్రజలను తప్పుదోవ పట్టించి ఎన్నికల్లో రాజకీయలబ్ధి పొందేందుకు విపక్ష పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తారని బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కాచిగూడలోని ఓబీసీ మోర్చా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రణాళిక ప్రకారం తప్పుడు ప్రచారానికి విపక్షాలు తెరతీశాయన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఎక్కడా.. అధికారికంగా ప్రకటన చేయలేదని వివరించారు. రిజర్వేషన్ల రద్దు అంశంపై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీజేపీ నేతలు, కార్యకర్తలు తిప్పికొట్టాలని ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పార్టీ నేతలు అచ్చిని రమేష్, వెంకటస్వామిగౌడ్, ఎంబీ కిషోర్‌కుమార్, ప్రణయ్‌సింగ్, విజయ్‌భావ్‌సార్, రమేష్ మేరు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషిచేయాలి

కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ : సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలంటూ డివిజన్ పరిధిలోని ఉన్నికోట, మల్లయ్యహోటల్, ముగ్గుబస్తీ, కొండారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్లు రవీందర్, ఇందిరాసింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ.. దేశం అన్ని రంగాల్లో రాణించాలంటే కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ రావాలని ఆంకాక్షించారు. కిషన్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, ఇన్‌చార్జి వేముల అశోక్, డివిజన్ అధ్యక్షులు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ సీనియర్ నాయకులు రాజాగౌడ్, సురేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి..

కాచిగూడ: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లుగా చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి కిషన్‌రెడ్డిని భారీ మెజారీతో గెలిపించాలని బీజేపీ మహిళా నేత, మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్ కాశీరాం జీరా ప్రాంతంలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికి తిరిగి మహిళలకు బొట్టు పెడుతూ.. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రపంచ దేశాలు భారత్ గురించి మాట్లాడుతున్నాయని ఇది మనకు గర్వించదగ్గ విషయమన్నారు. బీజేపీ నేతలు ఎక్కాల కన్నా, అశోక్ రెడ్డి, అంజమ్మ, భాగ్యలక్ష్మి, రజిత, మంజుల, విజయ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న బీజేపీ నేతలు



ఇంటింటి ప్రచారంలో మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా

బీజేపీతోనే అభివృద్ధి..

కాచిగూడ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ కోరారు. కాచిగూడ డివిజన్ బర్కత్‌పురలో సోమవారం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని, బీజేపీకి ఓటువేసి మనమంతా మోదీకి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. శ్యామ్‌రాజ్, చిట్టి శ్రీధర్, నందకిషోర్‌యాదవ్, వినోద్‌యాదవ్, శ్రీధర్ లోకండే, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

నల్లకుంట: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి సికింద్రాబాద్ లోక్‌సభ ఎంపీగా కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ యువమోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామ్‌జగదీష్ ముదిరాజ్ కోరారు. యువమోర్చా ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట మయూరిలేన్‌లో కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన నాయకులు గడిచిన పదేళ్లలో ప్రధాని మోదీ హయాంలో దేశంలో సాధించిన ప్రగతితో పాటు, ఈ ఐదేళ్లలో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రాంగదీష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ దేశాలు భారత్ గురించి మాట్లాడుతున్నాయని, ఇది మనకు గర్వించదగిన విషయమన్నారు. యువమోర్చా నాయకులు ప్రమోద్ కుమార్, రాఘవేంద్ర, శ్రవణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ ఉపేందర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ తరగతుల 10వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. యువత ఉచిత డ్రైవింగ్‌లో శిక్షణ పొంది ఉపాధి వైపు పయనించాలన్నారు. కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కార్యక్రమంలో కల్వ సుజాత గుప్తా తదితరులు

కాచిగూడ: అన్నం పరబ్రహ్మ స్వరూపమని 10 మందికి పంచి పెట్టడమే మహాదానమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా అన్నారు. వీబీజీ ఫౌండేషన్ చైర్మన్ మడిపడిగె రాము జన్మదినం సందర్భంగా సోమవారం నగరంలోని పలు ఆస్పత్రులు, అనాథాశ్రమాలు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌ల వద్ద అన్నదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజు, టీఎస్వీ ప్రసాద్, రాజేష్, శివ, నీల విజయలక్ష్మి, సతీష్, ప్రసన్న, సంతోష్, వాసంతి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

‘రిజర్వేషన్లు తొలగించే కుట్ర’

టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ సాయికుమార్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

కవాడిగూడ : రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం రిజర్వేషన్లను కల్పించిందని, వీటిని రద్దుచేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేయడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని మారుస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మోదీ ప్రధాని అయ్యారని, ఇప్పుడు రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి



ముషీరాబాద్ శివాలయం వీధిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ పెద్దపీట వేస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా భోలక్‌పూర్ డివిజన్‌లోని శివాలయం వీధిలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ ఓట్లకోసం రాజకీయ లబ్ధికోసం ప్రజలను మభ్యపెడుతూ.. ఆచరణలో అమలు కానీ హామీలను ఇస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు నిరంతరం విద్యుత్, తాగునీరు సరఫరా, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తున్న హామీలు ఆచరణలో అమలు కావడం లేదని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలనకు విసుగు చెందారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు రామేశ్వర్‌గౌడ్, ముఠా జైసింహ, రామారావు, రహీం, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు వంగాల నర్సింగ్‌రావు, కృష్ణ, మహేష్, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని శక్తిగా మెజార్టీ సాధిస్తాం..

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి మెజార్టీ ఓట్లే లక్ష్యంగా పని చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి దసోజు శ్రవణ్‌కుమార్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ఎన్నికల్లో తిరుగులేని మెజార్టీ సాధించవచ్చన్నారు. బూత్‌స్థాయిలో సమన్వయంతో పనిచేస్తే మెజార్టీ మనదేనని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. దసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తే బీఆర్‌ఎస్ పార్టీకి తిరుగు ఉండదని అభిప్రాయపడ్డారు. పార్టీ పరంగా ఎలాంటి ఇబ్బందులున్నా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, సీనియర్ నాయకులు బొడ్డుల ఓం ప్రకాష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, శ్రీనివాస్, మేడి ప్రసాద్, చంద్రమోహన్, భీష్మ, నాయకులు మధు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ.. బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్కు, ఎల్‌ఐజీ, లంబాడి తండా, శ్రీరామ్‌నగర్ బస్తీ, చిక్కడపల్లి, పాలమూరు బస్తీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటకృష్ణరావు, దామోదర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, నాగభూషణం, కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎన్నికల ఇన్‌చార్జి దసోజు శ్రవణ్



బాగ్‌లింగంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

వినతిపత్రం అందజేత



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్పిటల్స్ పరిశీలనలో భాగంగా గాంధీ ఆస్పత్రి పీవైఎల్, డీఓడబ్ల్యూ ప్రతినిధుల బృందం సోమవారం వెళ్లి పరిశీలించింది. ఈ సందర్భంగా వారు అవుట్ పేషంట్స్, ఇన్ పేషంట్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగుల రద్దీ పెరుగుతుందని, మందులు చాలా వరకు ఉచితంగా ఇస్తున్నారన్నారు. కొన్ని అందుబాటులో ఉండడం లేదన్నారు. కొన్ని విభాగాల్లో శాంక్షన్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో సూపరింటెండెంట్ చొరవతో వైద్య సేవలు అదించాల్సి వస్తుందన్నారు. ఆస్పత్రి సమస్యలపై సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావును కలిసి వినతి పత్రం అందించామన్నారు. ప్రభుత్వం గాంధీ హాస్పిటల్‌కి అధిక నిధులు కేటాయించాలని కోరారు. పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్, స్వరూప, లక్ష్మీబాయి, రవికుమార్, బీ.ఎస్. కృష్ణ, పుష్ప, శ్రీనివాస్, భీమేష్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డు రాకూడదు



మాట్లాడుతున్న ఎస్ఎల్‌వీపీసీటీ మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణ

నల్లకుంట: పేదరికం ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి శాపం కాకూడదని మైండ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఆర్ రవి కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం మొదటి అంతస్తులోని ద్యానమందిరంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్టు (ఎస్ఎల్‌వీపీసీటీ) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మైండ్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఆర్ రవికుమార్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ రంగారెడ్డి జిల్లా విశ్రాంత రీజినల్ ఇన్‌స్పెక్టర్ తూడి హన్మంతరెడ్డితో కలిసి మాట్లాడారు. ఎస్ఎల్‌వీపీసీటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి చేయూతనందించాలనే లక్ష్యంతో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఉచిత వసతి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, బీడీఎల్, భవానినగర్, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో వసతి గృహాలు నిర్వహిస్తున్నామని రామకృష్ణ పేర్కొన్నారు. ప్రతి ఏటా ఇంటర్వ్యూ ద్వారా విద్యార్థులను ఎంపికచేసి వసతి, భోజనం సదుపాయంతో పాటు ఉచితంగా బస్‌పాస్ కూడా అందిస్తున్నామన్నారు.

కథక్ కళాక్షేత్ర నాట్య ప్రదర్శన



చిక్కడపల్లి: అంతర్జాతీయ నాట్యదినోత్సవం సందర్భంగా ప్రముఖ నాట్య సంస్థ కథక్ కళాక్షేత్ర ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో సోమవారం రాత్రి నాట్య ప్రక్రియల సమాహారంగా ప్రదర్శనలు ప్రేక్షకరంజకంగా సాగాయి. యోగిని తన శిష్యబృందంతో కథక్, శాస్మిత మిశ్రా ఒడిస్సీ, లక్ష్మీప్రసూన మోహినీఅట్టం, లలితావినోద్ శిష్యబృందం భారత నాట్యం, మృణాళిని శిష్యబృందం కూచిపూడి , పేరిణి ప్రకాష్ బృందం పేరిణి నాట్యం, రాజేశ్వరి బృందం కథాకళి, మణిపురి నాట్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రణవే ఇనిస్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డైరెక్టర్ పద్మశ్రీ పద్మజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత 26 ఏళ్లుగా అంతర్జాతీయ దినోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రఫీ, పండిట్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వం.. ఉపాధికి సోపానం



సమావేశంలో ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల, డాక్టర్ సత్యనారాయణగౌడ్

కాచిగూడ: ఉద్యోగం సంపాదించడంలో విషయ పరిజ్ఞానం, విద్యార్హతతో పాటు ఉత్తమ వ్యక్తిత్వం, చక్కటి వస్త్రధారణ ఎంతో కీలకమని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల అన్నారు. నారాయణగూడ ఐపీఎంలోని ‘ కాలేజ్ ఆఫ్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ’ లో సోమవారం జరిగిన బీఎస్ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు, ఫ్రెషర్స్ విద్యార్థుల స్వాగత (ఫెస్ట్) వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత దేశానికి గొప్ప వనరని సరైన దిశలో సాధన చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థులు వైద్య రంగంలో ఉన్నత అవకాశాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. టీఎన్జీవోస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణగౌడ్, కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ అన్నపూర్ణ, డిప్యూటీ డైరెక్టర్ రామలత, నీల రమేష్, డాక్టర్ విజయశాంతి, డీఎంఎస్‌కే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన సంప్రదాయాలు ప్రపంచానికే తలమానికం

- మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే తలమానికమని మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ’ ఆధ్వర్యంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు సేవా స్వర్ణ నంది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భరతనాట్యం, కూచిపూడి, కథక్ తదితర నృత్యాల్లో పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ.. మన దేశ కలలు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ పొందాయన్నారు. కలలు ఎప్పుడు ప్రజలను ఆలోచింపజేస్తాయని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ రమాదేవి, భాస్కర చంద్రశేఖర్, శాతరాజు సాయికృష్ణ, దయాకర్, ప్రతిభరాజ్‌గౌడ్, తేనేటి అరుణ, కళావతి, యాదగిరి తదితరులను సేవా స్వర్ణ నంది అవార్డులతో ఘనంగా సత్కరించారు. సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, కోరియోగ్రాఫర్ సూర్యతేజసుబ్రాంత్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, లయన్ ఎస్వీ భారతి, కృష్ణాదినేషు, శ్రీనివాసులు, డాక్టర్ సురభిలక్ష్మీశారద తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ రమాదేవికి అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

వేసవి శిక్షణా శిబిరంలో సంగీత తరగతులు

చిక్కడపల్లి : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శ్రీసాయి నటరాజ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి సంగీత తరగతులు నిర్వహిస్తున్నామని అకాడమీ వ్యవస్థాపకురాలు గురు తులసి తెలిపారు. సోమవారం సాయంత్రం వివేక్‌నగర్‌లో ఆమె మాట్లాడుతూ.. మే 2వ తేదీ నుంచి ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగుతాయన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు 9849265903.

లింక్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేత

- పనులను అడ్డుకున్న సూరజ్‌నగర్ బస్తీ వాసులు
- బస్తీకి దారిచూపించాలని నిరసన

కవాడిగూడ : దోమలగూడ నుంచి అశోక్‌నగర్ లింక్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా తమ బస్తీకి దారిలేకుండా పోతుందని తమకు దారి చూపాలని స్థానికులు పనులను అడ్డుకున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి పత్రాలు చూపకుండా ఇష్టానుసారంగా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపడుతున్నారని ఆరోపించారు. సోమవారం సూరజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. దీంతో సూరజ్‌నగర్ బస్తీలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ బస్తీ బ్రిడ్జి నిర్మాణానికి వ్యతిరేకం కాదని, దాదాపు 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న 53 కుటుంబాలకు దారిచూపిన తర్వాతే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో ఎట్టి పరిస్థితుల్లో బ్రిడ్జి నిర్మాణం జరగనివ్వమని స్పష్టం చేశారు. ఈ సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుసార్లు తమ బస్తీ సమస్యలను వివరించినా ఎవరూ పట్టించుకోవడం లేదని అందుకే పనులను అడ్డుకున్నామన్నారు. తమ బస్తీకి దారి చూపుతూ.. పత్రాలు చూపేంతవరకు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించకుండా అడ్డుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి సరికాదు



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛపై దేశ వ్యాప్తంగా మాట్లాడుతున్న కవులు, కళాకారులు, మేధావులు, రచయితలపై దాడికి పాల్పడటం సరికాదని ఈ దాడిని అందరూ ఖండించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ అనేది రాజ్యాంగం యొక్క మూల సూత్రమని ఆ మూల సూత్రం ఆధారంగానే ఈ దేశం ప్రజాస్వామ్యయుతంగా, ఒక సెక్యూలర్ దేశంగా కొనసాగుతుందన్నారు. మేధావులు, రచయితలు, కవులు ప్రజల హక్కులను కాపాడటం కోసం తమ వాణిని వినిపిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా.. వారిని దేశద్రోహులుగా, అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి దాడులకు తెగబడుతుందని ఆదివారం జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఘటన బట్టి తేట తెల్లమవుతుందని దుయ్యబట్టారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు డాక్టర్ మల్లేష్, గణేష్, చాప కృష్ణ, హుస్సేన్, లక్ష్మి, శ్రీనన్న, యాదన్న, నర్సింహ్మా, శ్యామ్‌రావు, యువసేన రాష్ట్ర అధ్యక్షులు రమేష్, వెంకట్, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : సమూహ కవులు, రచయితలపై ఏబీవీపీ దాడులు సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందచారి, రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన్, సహాయ కార్యదర్శి సలీమలు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీతలు పసునూరి రవీందర్, మెర్సీ మార్గరెట్, కవి నరేష్‌కుమార్, టీవీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లుపై దాడి చేస్తూ.. చేయి చేసుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.